# ప్రవహించే పాదాలు



మంత్రి కృష్ణమోహన్

# ప్రవహించే పాదాలు

కవిత్వం

మంత్రి కృష్ణమోహన్

చందు ప్రచురణలు
మార్కాపురం

Pravahinche Pādālu
and other poems
by Manthri Krishna Mohan

© poet

First Edition
December 2012

Cover Drawing : Nivas

Cover Design & Bookmaking
KalimiSri

For Copies

Manthri Ravi Kumar
7-662 (K.43)
Opp.Srinivasa Theatre
Markapuram-523 316
Prakasam Dt.
Mobile : 94410 28186
and
All Leading Book Shops

**Price : Rs.60/-**

అమ్మ సత్యవతికి
నాన్న యోగేశ్వరరావుకు
ఎంతో ప్రేమతో...

సర్వశ్రీ డా.ఎన్.గోపి, డా.పాపినేని శివశంకర్, కె.శివారెడ్డి
డా.అద్దేపల్లి రామమోహనరావు, దర్భశయనం శ్రీనివాసాచార్య,
ఎస్.ఎ.టి.కె.ఆచార్య, నన్నపనేని రవి, ఆర్.రాఘవరెడ్డి,
'మల్లెతీగ' కలిమిశ్రీ, 'అశ్రుజల' రమణారెడ్డి
మరియు నా కుటుంబ సభ్యులకు
ఆయా కవితలు ప్రచురించిన పత్రికాధిపతులకు, సంపాదకులకు,
మిత్రులకు, శ్రేయోభిలాషులకు అందరికీ..
హృదయపూర్వక కృతజ్ఞతలు.

–మంత్రి కృష్ణమోహన్

# నడిచే కవిత్వం

❶ డా. ఎన్. గోపి

**నా**లుగేళ్ళ కిందట పరిచయమైన మంత్రి కృష్ణమోహన్ తొలి వినికిడిలోనే నా హృదయాన్ని దోచుకున్నాడు(తరచుగా ఫోన్‌లో మాట్లాడుకునేవాళ్లం). కారణం ఇతను కవిత్వం కోసం పడే తపన, ఒక స్పందన కోసం, ఒక భావచిత్రం కోసం, ఒక పదసౌందర్యం కోసం ఇతడు పడే ఆరాటం వల్ల ప్రకాశం జిల్లాలోని నల్లమల కొండల్లో ఏదో కవితాతపస్సు జరుగుతున్నట్టుగా తోచింది. లోగడ నానీల గురించి నాతో చర్చిస్తుండేవాడు. నిరుడు 'మట్టి పలకలు' పేరుతో నానీల సంపుటిని ప్రచురించాడు. నేను మార్కాపురం వెళ్లి ఆ గ్రంథాన్ని ఆవిష్కరించి వచ్చిన జ్ఞాపకాలు ఇప్పటికీ పచ్చగా వున్నాయి. ఆ నానీల ఉదాత్తస్థాయి వల్ల, కవితాత్మకత వల్ల పలువురిని ఆకర్షించాయి. అవార్డులు తెచ్చిపెట్టాయి.

వచన కవిత్వం రాయటం అంత సులభమేమీ కాదు. ఎనిమిది దశాబ్దాల వచనకవితా చరిత్రలో మైలురాళ్లూ, మేలిరాళ్ళు అనదగిన కవులు కొందరే వున్నారు. కవికి వస్తుబలంతో పాటు చక్కని శైలి కూడా వుండాలి. శైలి కవి భావవిధానంలో ఒక భాగమైనప్పుడే అతనికి బలమైన అభివ్యక్తి సమకూరుతుంది. సరిగ్గా అటువంటి ప్రయత్నంలో వున్నవాడు మన మంత్రి కృష్ణమోహన్. గుండెల నిండుగా ఉన్న సంవేదన వల్ల, అలవికాని అశాంతి వల్ల, సానపెట్టుకుంటున్న సాధన వల్ల, అన్నింటినీ మించి లోకంపట్లా, మనిషిపట్లా ఉన్న అపారమైన ప్రేమవల్ల ఇతని కవిత్వం ఆర్ద్రంగా, బలంగా, స్ఫూర్తిదాయకంగా, సురుచిరమౌక్తికంగా రూపొందుతున్నది.

కవితను ప్రారంభించినపుడు వున్న ఉద్వేగస్థాయి చివరిదాకా నిర్వహించగల శక్తి వున్నప్పుడే ఏ కవితైనా పండుతుంది. ఓ కవిత తనకు మాత్రమే అర్థమైతే సరిపోదు. పఠిత గుండెలకు తాకినప్పుడే దానికి సార్థకత. కవిలోని ఆర్తి ఓ భ్రమరంలా లోపల రొద చేయటం దాని ప్రారంభం మాత్రమే, పఠిత హృదయానికి వంతెన వేసి దానిపై పదసైన్యాలతో కవాతు చేయించి ఆవలి ఒడ్డుకు చేరుకొని, అక్కడ తరతరాలుగా నిక్షిప్తమై శబలితంగా వున్న భావాలతో చేయి కలిపినపుడే ఆ కవిత పూర్తయినట్టు లెక్క. మధ్యలోని ప్రక్రియ అంతా బహిరంతరలోకాలతో కవి చేసే సార్జనిక యుద్ధమే. 'ప్రవహించే పాదాలు' అనే కవిత దీనికి ఉదాహరణ.

*"మెత్తనిశయ్య మీద*
*మగత మెలకువలో విహరిస్తున్నా*
*గాఢనిద్రారాగాన్ని ఆలపిస్తున్నా*
*ఆ పాదాలు,*
*రేపటిశ్రమను స్మరిస్తూ వుంటాయి కాబోలు*
*ఏదో బృహత్తర మమకారాన్ని*
*స్వప్నిస్తూ వుంటాయి కాబోలు-*
*శ్రమించీ శ్రమించీ*
*మెత్తబడీ మెత్తబడీ*
*ఏ మృదుమృత్తికా హృదయాన్నో*
*పుణికిపుచ్చుకున్న పాదాలు కదా అవి!"*

ఇలా నడిచే పాదాల్లో సర్వకాలాల చలనం సాక్షాత్కరిస్తుంది. ఒకానొక క్రమోన్మీలన శిల్పంతో ఈ కవిత మనస్సును స్పృశిస్తుంది.

'వస్తువు లేనప్పుడు కవిత్వం పస్తులుంటుందని' నేను ఒకచోట రాశాను. కృష్ణమోహన్ కవిత్వంలో వస్తువుకు లోటు లేదు. పెన్ను విదిలిస్తే చాలు ఒక్కోచుక్కా ఒక్కో వస్తువుగా రూపాంతరం చెందేంత చలనశీల సామాగ్రి అతని దృగావరణంలో నిండి వుంది. 'శిలాగీతం' కవిత ఓసారి చదివితే తెలుస్తుంది.

*'ఈ రాయి మీదే*
*నేనక్షరాలు దిద్దుకున్నానంటే*
*యీ పిల్లలు నమ్మడం లేదు*
*ఈ రాయి పలకా బలపాల*
*అర్ధనారీశ్వర రూపమంటే*
*ఈ పిల్లలు నమ్మడం లేదు'*

ఈ వస్తువుకున్న అంచులన్నీ తళతళా మెరుస్తూ చివరకి కవిత్వం మీద ప్రేమగా పర్యవసిస్తాయి.

'నాకు మాత్రం ఈ రాయిమీద
కవిత్వం మీద వున్నంత ప్రేమ' అంటూ ముగిస్తాడు.

ఇలా ముగిస్తానని బహుశా అతనికి కూడా తెలియకపోవచ్చు. 'నానమ్మ కళ్ళద్దాలు' కవిత కూడా ఇలాంటిదే.

'ఒక కవిత్వ పుస్తకమూ-కొన్ని ఆకుపచ్చని మాటలూ' అనే కవిత కథనాత్మకంగా సాగిన మంచికవిత. బస్సు ప్రయాణంలో రాసిన కవిత. కవి ఓ కవిత్వ పుస్తకాన్ని

తిరగేస్తుంటాడు. అది 'తిన్నగా కూర్చోనివ్వదు', 'పరిగెత్తుతున్న పచ్చని పొలంమీద విహంగమై వాలమంటుంది', 'చుట్టూ వో ధ్యానమందిరం నిర్మిస్తుంది', 'అగోచర ఏకాంతసీమల్లోకి దారులు వేస్తుంది' ఇలా సాగుతూ సాగుతూ గమ్యం రాగానే బస్సుదిగిపోతాడు కవి. టికెట్ వెనుక కండక్టర్ రాసిచ్చిన ఐదు రూపాయలు గుర్తొస్తాయి కానీ అడగాలనిపించదు. కవిత పుట్టడానికి కారణమైన ఈ ప్రయాణానికి అతను చెల్లించిన కృతజ్ఞతాపూర్వక సుంకం అది! ఇక్కడో సంగతి చెప్పాలి. కవిత్వాన్ని చదవడం, ఇతర గ్రంథాలు చదవడం ఒకటి కాదు. కవిత్వం ఎప్పటికీ ముగిసేది కాదు, ఎన్నిసార్లు చదివినా దాని తాజాదనం పోదు, ఎప్పుడు చదివినా ఏదో ఒక కొత్త స్ఫురణ కలుగుతూనే వుంటుంది.

వచన కవితా రచనలో నిర్వహణ కూడా ఒక ముఖ్యమైన అంశం. ఈ కవిత చూడండి. 'పోయమే రాయనక్కరలేదు' కవితలో అదే వాక్యం ఐదుసార్లు ఆవృతమౌతుంది. ఆవృతమైనప్పుడల్లా కవిత్వం గొప్పదా, కవిత్వానికి మూలమైన దృశ్య, ఘటనలు గొప్పవా అన్న విచికిత్స తళుక్కున మెరుస్తుంది. ఒకరకంగా ఇది వినిర్మాణ కవిత (Structural Poem). దేన్నైనా కవిత్వం చేయగల శక్తి ఈ కవికి వుందని దీనిలోని చాలా కవితలు చెప్తాయి. బోరు బావి మృత్యుబిలం అయినపుడు కలతపడి రాసిన 'జరిగింది చాలు' కవిత, హంపిని చూసినపుడు అప్రయత్నంగా ముక్తకాలుగా వర్షించిన ఆర్ద్రభావన మొదలైనవి ఈ కవి నిలువెల్లా కవిత్వమై బ్రతుకుతున్నాడనడానికి నిదర్శనాలుగా నిలుస్తాయి.

'ప్రేమ' అనే ఈ కవితను చూడండి.

*'ఎన్ని రూపాల్లో వ్యక్తమైనా*<br>
*ఇంకా ఎంతో కొంత*<br>
*మిగిలే వుంటుంది–'* ఇలా ఎత్తుకోవడంలోనే కవిత్వం యొక్క కంఠస్వరం తెలిసిపోతుంది. ఒక్కోపాదాన్ని దాటుతూ వెళ్తుంటే, ఆ గొంతులోని జీర పలు శబ్దశకలాలుగా వ్యక్తమవుతుంది.

'తనువంతా<br>
తరువై పోతే ఎంత బాగుండు!<br>
ఎప్పుడూ పచ్చగా నవ్వడం కంటే<br>
భోగమేముంది' (ఆశ) – లాంటి ఎత్తుగడలు కూడా ఈ కోవలోకే వస్తాయి.

ఈ కవిలో నాకు నచ్చిన ప్రధానమైన అంశం నిజాయితి. కవిలో ఒక అమాయకత్వం, పసితనం లేకపోతే సరస్సులో అడుగు కనిపించదు. కవికి అనవసరమైన తెలివి వున్నప్పుడే తంటా. పఠితను మోసగించటం అంత సులభం కాదు. నిజమైన స్పందనలో నటన వుండదు. 'దుఃఖగీతం' కవిత చదివినపుడు నాకీ అభిప్రాయం కలిగింది. మనకు రోజూ ఎన్నో దృశ్యాలు కనిపిస్తాయి కానీ మనం చూడం. రోజూ చూసేవే కానీ నిత్యజీవన

వ్యావృత్తిలో అవి మన మనస్సును తప్పించుకునిపోతాయి. 'బొమ్మా–బొరుసూ' కవితలో ఈ పంక్తులు చూడండి.

'నాలుగు బెలూన్‌లుంటే చాలు–
అతని చేతివేళ్ళ మధ్యగా
వో అందమైన బొమ్మ ఉదయిస్తుంది
నవనవలాడే ఓ పొడవాటి బెలూన్ నిండా
ఊపిరి నింపి
మూతివైపు చిన్న ముడేసి
నాల్గోభాగం దగ్గర మెలితిప్పాడా–
బొమ్మ ముఖాన్ని ఆవిష్కరించినట్టే!'

ఆసుపత్రిని గురించి ఎందరో చెప్పారు. ఇవాల్టి ఆసుపత్రిని గురించి కృష్ణమోహన్ 'నగరం నడిబొడ్డున/ఇదో యుద్ధసముద్రం/మృత్యువుతో పోరాడ్డమెలాగో/తెలుసుకోవాలిక్కడ' అంటూ ఒక్కమాటలో తేల్చేశాడు.

'ఇద్దరిమధ్య' అనే కవిత, కవి వయస్సును మించిన పరిణతితో వున్న కవిత. మనుషులిద్దరు కలవకుండా వారిమధ్య అడ్డుపడేదేమిటో తెలుసుకోవడానికి ముప్పై పంక్తుల్లో ధారాసమన్వితమైన ప్రయాణం చేశాడు కవి. సమాధానం దొరికిందా అంటే దొరికింది. 'అహంకారమే ఆ అడ్డు'. నాకేమనిపిస్తుందంటే ఇతరుల్ని మనం పొందాలనుకున్నప్పుడు మనల్ని మనం కొంత త్యాగం చేసుకోక తప్పదు.

ఇలా ప్రతి కవిత గురించి ఎంతో కొంత నేను మాట్లాడగలను. కృష్ణమోహన్ తన కవిత్వాన్ని గురించి ముందుమాటలు రాయమన్నప్పుడు ఇతని గురించి తీర్పులు చెప్పకుండా ఇతని భావధారను పట్టుకొని, ఇతని ఉద్రిక్తరేఖపై విన్యాసాలు చేస్తూ ఇతని అన్వేషణలో పాలుపంచుకుంటూ, ఇతని ఆవేదనతో మమేకమవుతూ, అనుభవించి పలవరించే పద్ధతినే నేను ఎన్నుకోవాలనుకున్నాను.

కవికీ, పాఠకుడికీ మధ్య విమర్శకుడి అవసరం వచ్చేది కవిత చదివిన తర్వాతే. అది కూడా పఠిత అవసరం అనుకున్నప్పుడే కాని నేనిదంతా ముందే రాసినట్టున్నాను. విమర్శకుడిగా కాక సహృదయుడిగా ఉండాలనేది నా తాపత్రయం.

మంత్రి కృష్ణమోహన్ నా మనసుకెంతో దగ్గరైనవాడు. అయినా ఆత్మీయతాదోషం అంటకుండానే ఇతడు ఉత్తమకవుల కోవకు చెందుతాడని నేను ఘంటాపథంగా చెప్పగలను. అలా చెప్పగలగడానికి ఇతని అంతరాంతరసీమల్లోకి వెళ్ళిరావడం ఒక కారణం. మీరూ ఆ పని చేయాలని నా కోరిక.

*

## కవితల క్రమం


| | | |
|---|---|---|
| 1. | శిలాగీతం.................................... | 1 |
| 2. | ఎ విజిట్ టు వృద్ధాశ్రమం..................... | 3 |
| 3. | ప్రవహించే పాదాలు........................... | 5 |
| 4. | మనసైన పుస్తకం............................. | 7 |
| 5. | ప్రేమ.......................................... | 9 |
| 6. | శ్రీకారం........................................ | 10 |
| 7. | చెట్టు పోయిన తర్వాత...................... | 12 |
| 8. | డైరీలో ఒకపేజీ............................ | 14 |
| 9. | ముకురం ముందు.......................... | 16 |
| 10. | నన్ను నేను................................ | 18 |
| 11. | ఇద్దరి మధ్య................................ | 20 |
| 12. | రాత్రి.......................................... | 22 |
| 13. | ఏకవాక్యం.................................... | 24 |
| 14. | వాళ్లు చల్లబడరు............................ | 27 |
| 15. | జరిగింది చాలు............................. | 29 |
| 16. | అంతరం.................................... | 31 |
| 17. | మౌనమూ మాట్లాడుతుంది.................. | 33 |
| 18. | ఆశ.......................................... | 34 |
| 18. | చలన చిత్రాలు............................... | 36 |
| 19. | తిరిగిరాని వెన్నెల........................... | 38 |
| 20. | ఒక నిట్టూర్పు.............................. | 39 |
| 21. | ఖబడ్దార్....................................... | 40 |
| 22. | కవ్వం......................................... | 42 |
| 23. | సూక్తి.......................................... | 44 |
| 24. | దయావర్షం.................................. | 45 |
| 25. | ఓ లోతట్టు దృశ్యం.......................... | 48 |

| | | |
|---|---|---|
| 26. | హంపి కవితలు....................................... | 49 |
| 27. | బొమ్మా బొరుసూ..................................... | 53 |
| 28. | యుద్ధసముద్రం..................................... | 55 |
| 29. | సమాధానముందా?................................... | 57 |
| 30. | ఒక కవిత్వ పుస్తకమూ–కొన్ని ఆకుపచ్చని మాటలూ... | 58 |
| 31. | ముద్దుపేరు.......................................... | 61 |
| 32. | రెండు జీతాలు...................................... | 63 |
| 33. | దుఃఖగీతం.......................................... | 64 |
| 34. | దాహం.............................................. | 67 |
| 35. | తడి ఆరని రాగాన్ని.................................. | 69 |
| 36. | కథాయానం.......................................... | 75 |
| 37. | నానమ్మ కళ్ళద్దాలు.................................. | 78 |
| 38. | గుండె పండు........................................ | 80 |
| 39. | మైదానంలోకి....................................... | 83 |
| 40. | ఆత్మని చూడు...................................... | 86 |
| 41. | గాయం నా గురువు.................................. | 87 |
| 42. | మట్టిమనసుకు నీరాజనం............................. | 88 |
| 43. | నాన్నకు క్షమాపణ................................... | 90 |
| 44. | పోయమే రాయనక్కర్లేదు............................ | 93 |

# శిలాగీతం

ఈ రాయిమీదే
నేనక్షరాలు దిద్దుకున్నానంటే
యీ పిల్లలు నమ్మడం లేదు
ఈ రాయి
పలకా బలపాల అర్ధనారీశ్వర రూపమంటే
యీ పిల్లలు నమ్మడం లేదు
ఈ రాయి మీద
ఎన్నెన్నో చెమటసముద్రాలు ఆవిరయ్యాయంటే
యీ పిల్లలు నమ్మడం లేదు
అక్షరాలకు ఆసనమవ్వడానికి
ఈ రాయి
ఎన్ని రాతి దెబ్బలు తిన్నదో
వీళ్ళకేం తెలుసు!
ఇప్పుడీ రాతితో
భవన నిర్మాణం చేస్తున్నారు గానీ
ఒకప్పుడు ఈ దేశమంతా
ఈ రాయి మీదే ఓనమాలు దిద్దింది
మా వూరి ఆకాశానికి
నీలం రంగు అద్దింది
ఈ రాయే.
మా వూరి జనం పాటలకు
గ్రాంఫోన్ రికార్డు ఈ రాయే

మా వూరి చరిత్రకు
శిలాశాసనమూ ఈ రాయే
కొలనులో నీటి అలల్లా పట్నమై విస్తరించిందీ
ఈ రాయి కేంద్రంగానే
మా వూరి వైభవమంతా
యీ రాయి గుండెల్లో నిక్షిప్తమై వుందంటే
నా బాల్యపు స్మృతులన్నీ
యీ ప్రస్తరం మీదే నర్తిస్తున్నాయంటే
ఈ రాయి మీదే
నా తొలిపద్యం మొలకెత్తిందంటే
వీళ్ళు నమ్మలేరు గానీ
నాకు మాత్రం యీ రాయి మీద
కవిత్వం మీద వున్నంత ప్రేమ.

*చినుకు ◆ సెప్టెంబర్ 2009*
*కవిత ◆ 2009*

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/kbook.php?id=2652**

* * *